బాబోయ్ కుక్కలు

కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులు, గుంపులుగా తిరుగుతూ మనుషులపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. వాహనదారుల వెంట పడుతున్నాయి. చిన్నారుల ప్రాణాలను బలిగొంటున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలో రోజూ ఏదో ఓ ప్రాంతంలో కుక్కల దాడిలో ప్రజలు గాయపడుతున్నారు. తాజాగా శుక్రవారం పట్టణంలోని మోదీనాబాద్ నాయీబ్రాహ్మణ కాలనీలో ఆరేళ్ల బాలుడు ధనుంజయపై వీధి కుక్క దాడి చేసి గాయపరిచింది.

- శునకాల దాడులతో హడలెత్తుతున్న పురప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు


మోదీనాబాద్‌లో గుంపులుగా వెళ్తున్న వీధి కుక్కలు


కుక్కదాడిలో గాయపడి ఆస్పత్రికి వచ్చిన బాలుడు ధనుంజయ

గుంతకల్లుటౌన్: కుక్కల దాడులతో గుంతకల్లు వాసులు హడలెత్తిపోతున్నారు. గుంపులు గుంపులుగా తిరుగుతున్న శునకాలను చూసి రోడ్లపై తిరగాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. చిన్నారులపై కుక్కలు దాడి చేసి గాయపరుస్తాయేమోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్రవాహనాల వెంబడి శునకాలు పరిగెత్తడం వల్ల అనేక మంది కిందపడి గాయాల పాలవుతున్నారు. మున్సిపల్ ప్రజారోగ్య విభాగపు అధికారుల లెక్కల ప్రకారం గుంతకల్లు పట్టణంలో సుమారు 2,700 వీధి కుక్కలున్నాయి. వీటిలో 1,600 కుక్కలను పట్టించి వాటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స జరిపించారు. రేబీస్ టీకాలు వేయించి తిరిగి వాటిని పట్టిన ప్రదేశంలోనే వదిలేస్తున్నారు. అయితే కుక్క కాటు కేసులేమో రోజూ పెరుగుతూనే ఉన్నాయి. కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని, కుక్కల సంరక్షణకు అవసరమైతే డంపింగ్‌యార్డు సమీపంలో మున్సిపాలిటీ తరఫున షెడ్లను ఏర్పాటు చేసి, వాటికి ఆహార వ్యర్థాలను అందించే ఏర్పాటు చేయించాలని కౌన్సిల్ సభ్యులు ప్రతి సమావేశంలో అడగటం, అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి జంతు సంరక్షణతో పాటు ప్రజల ప్రాణాలు కాపాడేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కుక్క కాటుతో బాలుడికి తీవ్రగాయాలు

పట్టణంలోని మోదినాబాద్ నాయీబ్రాహ్మణ కాలనీలో శుక్రవారం ఇంటివద్ద ఆడుకుంటున్న ధనుంజయ అనే ఆరేళ్ల బాలుడిపై వీధి కుక్క రెచ్చిపోయింది. బాలుడిపై విచక్షణా రహితంగా దాడిచేయడంతో కుడి చేయికి తీవ్ర గాయమైంది. దీంతో బాలుడిని ప్రభుత్వస్పత్రికి తీసుకువచ్చి ఏఆర్ వ్యాక్సిన్ వేయించినట్లు బాలుడి అమ్మమ్మ శకుంతల తెలిపారు. కర్నూల్ జిల్లా మద్దికెర మండలం పెరవలి గ్రామానికి చెందిన తన మనవడు దసరా సెలవుల నిమిత్తం ఇక్కడికి వచ్చి కుక్కదాడిలో గాయపడ్డారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

కుక్కలకు టీకాలు వేయించాం

జాతీయ జంతు సంక్షేమ బోర్డు రూల్స్ ప్రకారం కుక్కలను చంపడం, వేరే ప్రాంతానికి తరలించడం చట్టవిరుద్ధం. అందువల్ల పట్టణంలో ఉన్న సుమారు 2,700 వీధి కుక్కలకు గానూ ఇప్పటివరకు 1,600 కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించి రేబీస్ టీకాలు వేయించాం. మిగిలిన వాటికి కూడా వేయించేందుకు చర్యలు చేపడుతున్నాం.

– చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, గుంతకల్లు

క్లుప్తంగా

స్త్రీల మాన, ప్రాణాలు కాపాడిన ధీశాలి


గూళ్లపాళ్యం హంపన్న సమాధి వద్ద పూలు చల్లి నివాళులు అర్పిస్తున్న చైర్ పర్సన్ వన్నూర్‌బీ, కమిటీ సభ్యులు

గుత్తి: బ్రిటిష్ సిపాయిల నుంచి ఇద్దరు మహిళల మాన, ప్రాణాలు కాపాడి ప్రాణాలర్పించిన ధీశాలి గూళ్లపాళ్లం హంపన్న అని వక్తలు అన్నారు. పట్టణంలోని మున్రో సత్రం సమీపంలో ఉన్న హంపన్న సమాధి వద్ద శుక్రవారం హంపన్న అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో హంపన్న 131 వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్‌తో కలిసి హంపన్న అభివృద్ధి కమిటీ సభ్యులు హంపన్న సమాధి వద్ద పూలు చల్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్, హంపన్న అభివృద్ధి కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇస్మాయిల్, ,సీపీఐ మండల కార్యదర్శి రామదాసు మాట్లాడుతూ హంపన్న సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో హంపన్న అభివృద్ధి కమిటీ సభ్యులు నిజామ్, నాగేంద్రప్రసాద్, రామదాసు, జిలాన్, రఫి, కళాకారుడు డోలక్ షఫి, ఏఐఎస్ఎఫ్ ఈశ్వర్, సీపీఎం నాయకులు రేణుక, నిర్మల, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు


మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రత్యేక చర్యలు చేపడుతామని ఎంపీపీ సునీత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీతోపాటు జెడ్పీటీసీ భాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దటి నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుణ్యవతి, ఎంఈఓ నవీద, హౌసింగ్ డీఈ రామ్మూర్తి, ఐసీడీఎస్ సీడీపీఓ ఉమాశంకరమ్మ, ఏఓ శ్రీవాణి, ఇతర అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో యువకుడిపై దాడి

గుంతకల్లు రూరల్: స్థల వివాదంలో మండలంలోని కసాపురానికి చెందిన రామచంద్ర అనే యువకుడిపై శుక్రవారం అతడి చిన్నాన్న కొడుకులు రమేష్, చిన్న ఆంజనేయులు దాడి చేశారు. బాధితుడి వివరాల మేరకు.. తాతల నుంచి సంక్రమించిన వామిదొడ్డి స్థలాన్ని రామచంద్ర తండ్రి ఆంజనేయులుతోపాటు మిగిలిన ఇద్దరు అన్నదమ్ములు సమానంగా పంచుకున్నారు. ఈక్రమంలో తమ భాగానికి వచ్చిన స్థలంలో రామచంద్ర రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకునేందుకు శుక్రవారం పనులు చేపట్టాడు. అదే సమయంలో చిన్నాన్న రామకృష్ణ, ఆయన కుమారులు ఆ స్థలం తమకే చెందుతుందని గొడవకు దిగారు. మాటామాటా పెరగడంతో రమేష్, అతడి తమ్ముడు చిన్న ఆంజనేయులు, వారి అమ్మ సువర్ణ కలసి రామచంద్రపై దాడి చేశారు. గాయపడిన రామచంద్రను గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కసాపురం పోలీసులు విచారణ చేపట్టారు.

వైద్యుల నిర్లక్ష్యంపై ఆందోళన


పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న శివ కుటుంబ సభ్యులు

పామిడి: పట్టణంలోని ఎద్దులపల్లిరోడ్డులోని ఆనంద్ హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యంపై రోగి కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి ఆస్పత్రి ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. వారి వివరాల మేరకు.. గత నెల 3న ఎడమ కాలు నొప్పి ఉండడంతో ఆటో డ్రైవర్ నక్కల శివను కుటుంబ సభ్యులు ఆనంద్ హాస్పిటల్లో చేర్చారు. చికిత్స చేస్తుండగా కాలు వాపు రావడంతో అనంతపురం తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. అనంతపురంలో డాక్టర్ సంప్రదించగా మోతాదుకు మించిన మందులు వాడడంతో వైద్యం వికటించడం వల్లే ఈ దుస్థితి నెలకొందని తెలిపారు. వారి సూచన మేరకు బెంగుళూరులోని సెయింట్ జాన్స్ హాస్పిటల్‌కు అతడిని తీసుకెళ్లారు. కాలు నయం కావాలంటే దాదాపు రూ.5 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు. ఇప్పటికే రూ.4లక్షలు ఖర్చు అయినా నయం కాలేదని అతడి భార్య రత్న విలేకరుల ఎదుట వాపోయింది. డాక్టర్ ఆనంద్ హాస్పిటల్‌లో వైద్యం వికటించడంపై విచారణచేసి పేదలమైన మాకు న్యాయం చేకూర్చాలంటూ అతడి కుటుంబసభ్యులు సీఐ యుగంధర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేసి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

పశు వైద్యశాలకు తాళం!


పశువైద్యశాలకు తాళం వేసిన దృశ్యం

పుట్లూరు: మండలకేంద్రంలోని పశువైద్యశాలకు శుక్రవారం తాళాలు వేశారు. మండలవ్యాప్తంగా 23 గ్రామ పంచాయతీలకు మండలకేంద్రంలోని పశువైద్యశాల మాత్రమే ఆధారం. రోజూ పలు గ్రామాల నుంచి పాడి రైతులు, గొర్రెల కాపరులు ఈ ఆసుపత్రికి వచ్చి తమ జీవాలకు వైద్య చికిత్సలు చేయిస్తారు. రైతు సేవా కేంద్రాల్లోని పశువైద్య సహాయకులు సైతం శుక్రవారం అందుబాటులో లేకపోవడం, పశువైద్యశాలకు తాళాలు వేసి ఉండటం రైతులకు ఇబ్బందికరంగా మారింది. కనీసం అటెండర్ కూడా ఆస్పత్రి వద్ద అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఈ విషయమై పశువైద్యాధికారి నాగసువర్ణను 'సాక్షి' వివరణ కోరగా రైతు సేవా కేంద్రాల్లోని పశువైద్య సిబ్బంది సహా అనంతపురంలోని డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి వెళ్లామన్నారు. అటెండర్ డెప్యుటేషన్‌పై తాడిపత్రికి వెళ్లినట్లు ఆమె తెలిపారు.

'వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి'

బుక్కరాయసముద్రం: వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో సీఐ కరుణాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ బీకేఎస్ మండలంలో రెడ్డిపల్లికి చెందిన రాముడు ఇటీవల వడ్డీ వ్యాపారుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. గతంలో పసుపూరులో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. పోలీసులు దృష్టి సారించి అధిక వడ్డీ వ్యాపారస్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పూసల సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతు, నాగరాజు, మారుతీ, రామాంజినేయులు, నరేష్, రామక్రిష్ణ, రమేష్, నాగమ్మ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు

గుంతకల్లు రూరల్: మండలంలోని నక్కనదొడ్డి తండా గ్రామంలో దోమల నివారణ చర్యలను చేపట్టారు. వైద్య సిబ్బంది గ్రామంలోని రోడ్లు, కాలువలతోపాటు ప్రతి ఇంటికి వెళ్లి దోమల నివారణ మందు పిచికారీ చేశారు. జిల్లా మలేరియా అధికారి ఓబులు, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ, గుంతకల్లు మండలం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్‌కుమార్ బాబు, సబ్ యూనిట్ ఆఫీసర్ వినయ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పీఏబీఆర్ సందర్శన


పీఏబీఆర్ వద్ద ఎస్ఆర్ఐటీ విద్యార్థులు

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బీటెక్ తృతీయ సంవత్సరం సివిల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు కొర్రకోడులోని పెన్న అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పీఏబీఆర్ డ్యాంను సందర్శించారు. డ్యాం వద్ద వివిధ సాంకేతిక, నిర్మాణాల విభాగాలను పరిశీలించారు. ప్రాంతీయ విద్యుత్ ఉత్పత్తి, నీటి నిర్వహణలో దాని పాత్రపై వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రఘుబాబు, లక్ష్మి శిరీష, స్వాతి హెచ్ఎల్‌సీ పీఏబీఆర్ ఇంజినీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లి శివారులో శుక్రవారం ద్విచక్రవాహనం అదుపు తప్పి దివాకర్‌నాయక్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మిద్దె తండా గ్రామానికి చెందిన దివాకర్‌నాయక్ పని నిమిత్తం ద్విచక్రవాహనంలో గుత్తికి బయలుదేరాడు. బసినేపల్లి వద్దకు రాగానే ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని 108 ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తరిమెల క్రాస్ వద్ద..

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో తరిమెల క్రాస్ 44వ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. పాత కల్లూరుకు చెందిన శ్రీనివాసులు తరిమెల క్రాస్ వద్ద ద్విచక్రవాహనంలో రోడ్డు దాటుతుండగా బెంగళూరు వైపు నుంచి హైదరాబాద్ వెళ్లే బొలేరో వాహనం ఢీకొంది. గాయపడిన శ్రీనివాసులు స్థానికులు పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రిటైర్డ్ గైనకాలజిస్ట్‌పై విచారణ

గుంతకల్లు: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో గైనకాలజిస్ట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఓ వైద్యురాలిపై శుక్రవారం విచారణ జరిగింది. సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ పార్టీ నాయకుడు సురేష్ 2017లో గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఆమెపై పలు ఆరోపణలు చేస్తూ జిల్లా వైద్య అధికారులతోపాటు ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేశాడు. ప్రభుత్వాస్పత్రికి వచ్చే గర్భిణులను తను నడుపుతున్న ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్ చేయడంతోపాటు ఆస్పత్రిలో నూతన బిల్డింగ్ నిధులు విషయంలో గోల్‌మాల్‌పై ఫిర్యాదు చేశాడు. దాదాపు ఏడేళ్ల తరువాత వైఎస్సార్ జిల్లా కోర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీస్ (డీసీహెచ్ఎస్) హిమదేవి తన బృందంతో కలిసి విచారణ చేపట్టారు. ఆ సందర్భంగా 2017 నాటి రికార్డులను పరిశీలించారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు ఆమె తెలిపారు.

బంగారు దుకాణంలో చోరీ

గుత్తి: పట్టణంలోని కటిక బజారులో గుప్తా బంగారు షాపులో శుక్రవారం చోరీ జరిగింది.ఓ గుర్తు తెలియని వ్యక్తి 12 గ్రాముల బంగారు చైన్‌ను ఎత్తుకెళ్లాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. బాధితుడు లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఉచిత ఇసుక హామీ అమలు చేయండి


గుంతకల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

తాడిపత్రి రూరల్/గుంతకల్లు రూరల్/పుట్లూరు/గుత్తి/గార్లదిన్నె: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీపీఎం నాయకులు తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సీపీఎం నాయకుడు జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా ఉచిత ఇసుక హామీ అమలు చేయడంలో విఫలమైందన్నారు. రవాణా పేరు చెప్పి దోచుకుంటున్నారన్నారు. ఇసుక రేట్లు గణనీయంగా పెరిగాయన్నారు. ఇసుక కొరత వల్ల భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ రజాక్‌వలికి అందచేశారు. నాయకులు, నాగరాజు, చంటి, రామ్మోహన్, శ్రీరాములు, శివ బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.అలాగే గుంతకల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు బీ.శ్రీనివాసులు, నాగరాజు, రమేష్, మారుతి, సునీల్ కుమార్ ధర్నా చేశారు. ప్రభుత్వం స్పందించి ఉచిత ఇసుక హామీని నెరవేర్చేందుకు చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో భారీ ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అదేవిధంగా పుట్లూరులో ధర్నా అనంతరం సీపీఎం మండల కార్యదర్శి సూరి తదితరులు డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్‌కు వినతిపత్రం అందించారు. గుత్తిలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల, మండల కమిటీ సభ్యులు రేణుకమ్మ, మల్లికార్జున, నాయకులు రేవతి, శ్యామల, కవిత, మారి, అనిల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ ఓబిలేసుకు వినతిపత్రం అందజేశారు. గార్లదిన్నెలో ధర్నా అనంతరం తహసీల్దార్ ఈరమ్మకు సీపీఎం నాయకులు నాగరాజు, చెన్నారెడ్డి, మల్లికార్జున, నాగలక్ష్మి వినతిపత్రం అందజేశారు.

శాస్త్రీయ పద్ధతులు పాటించాలి


మాట్లాడుతున్న డీడీఏహెచ్ డాక్టర్ వై.రమేష్‌రెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: పశుసంతతి పెంపు, పునరుత్పత్తి యాజమాన్యంలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలని పశుసంవర్ధకశాఖ అనంతపురం డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వై.రమేష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక డీడీ హాలులో తాడిపత్రి, యల్లనూరు, గుత్తి, బుక్కరాయసముద్రం మండలాల పరిధిలో ఉన్న ఏరియా ఆసుపత్రులు, వీడీ అధికారులు, అలాగే విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్ (వీఏహెచ్ఏ) పనితీరు, ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ కింద వివిధ అంశాలపై వివరించారు. పశుసంపద, జీవసంపద పరిరక్షణ, సంతతి పెంపు విషయంలో శాస్త్రీయ పద్ధతులు అవలంభించాలన్నారు. సీజనల్, అంటువ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్రమం తప్పకుండా షెడ్యూల్ ప్రకారం టీకాలు చేపట్టాలన్నారు. గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. వ్యాధులకు సంబంధించి నమూనాల సేకరణ, కృత్రిమ గర్భధారణ, చూడి నిర్ధారణ, రోజువారీ రిజిష్టర్ల నిర్వహణ, గోకులం పథకం ప్రగతి తదితర అంశాలపై సమీక్షిస్తూనే అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్ టి.సుధాకర్, ఏడీ డాక్టర్ ఏవీ రత్నకుమార్, పశువైద్యులు డాక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై చర్యలు

గార్లదిన్నె: ఎస్సీ,ఎస్టీ భూములు ఆక్రమించుకుంటే చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ వసంతబాబు హెచ్చరించారు. యర్రగుంట్లకు చెందిన కళావతి భూమిలో 44 సెంట్లను ఆక్రమించుకున్నారన్న ఫిర్యాదు మేరకు.. తహసీల్దార్ ఈరమ్మ, ఎస్సీ,ఎస్టీ సంఘాల నాయకులతో కలసి ఆయన క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించారు. భూ సమస్య పరిష్క రించాలని తహసీల్దార్ ఈరమ్మకు సూచించారు. ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

గుత్తి: ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ మద్యం షాపుల సేల్స్‌మెన్లు, సూపర్ వైజర్లు పట్టణంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్ వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. అశోక్, వెంకి, విజయ్ మాట్లాడుతూ మద్యం షాపులను ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు ఇసే ఉపాధి కోల్పోతామన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎక్సైజ్ ఎస్ఐ అస్లాం బేగ్‌కు అందజేశారు.

పకడ్బందీగా పంటకోత ప్రయోగాలు


పంట కోత ప్రయోగాలను పరిశీలిస్తున్న ఏడీఏ రవి

బుక్కరాయసముద్రం: పంట కోత ప్రయోగాలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు రవి సూచించారు. శుక్రవారం మండలంలోని జంతలూరు, గోవిందపల్లిలో వ్యవసాయ శాఖ అధికారులు చేపడుతున్న పంట కోత ప్రయోగాలను ఆయన పరిశీలించారు. అధికారులు నలుగురు రైతుల వేరుశనగ పొలాల్లో పంట కోత ప్రయోగాలు నిర్వహించగా వరుసగా 2.670 కిలోలు, 2.150 కిలోలు, 1.160 కిలోలు, 1.290 కిలోలు వచ్చాయి. కార్యక్రమంలో ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి, ఏఎస్ఓ పోతిరెడ్డి, ఏఈఓ జ్ఞానజ్యోతి, పట్టు సహాయకుడు రమాకాంత్, రైతులు పాల్గొన్నారు.

ఎస్ఐగా ధరణిబాబు



తాడిపత్రి రూరల్: తాడిపత్రి అప్‌గ్రేడ్ రూరల్ ఎస్ఐగా ధరణిబాబు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. తనకల్లు నుంచి ఆయన బదిలీపై తాడిపత్రికి వచ్చారు. కాగా గతంలో ఆయన తాడిపత్రి పట్టణ ఎస్ఐగా పనిచేశారు.

బాధ్యతల స్వీకరణ

యాడికి: ఎంపీడీఓగా శుక్రవారం వీరరాజు బాధ్యతలు స్వీకరించారు. ఈయన యల్లనూరు నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న లక్ష్మీనారాయణ బెళుగుప్పకు బదిలీ అయ్యారు. పామిడి ఈఓపీఆర్‌డీ శశికళ బదిలీపై వచ్చి యాడికి ఈఓపీఆర్డీగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటేశ్వర్లు తాడిపత్రికి బదిలీ అయ్యారు. పీఆర్ ఏఈ ఆదినారాయణరెడ్డి తాడిపత్రికి బదిలీ అయ్యారు. పుట్లూరు పీఆర్ ఏఈ యలమయ్యనాయుడు యాడికికి బదిలీ అయ్యారు. యాడికి మేజర్ పంచాయతీ ఈఓగా అశ్వర్థ నాయుడు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన నార్పల మండలం నుంచి ఇక్కడకు వచ్చారు. యాడికిలో ఈఓగా విధులు నిర్వహించిన ఎర్రిస్వామి విడపనకల్లుకు బదిలీ అయ్యారు.

ఎంపీడీఓగా బరెన్‌సాహెబ్

పెద్దవడుగూరు: ఎంపీడీఓ గా బరెన్‌సాహెబ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఏపీఓ పుల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. సత్యసాయి జిల్లా కొత్తచెరువు నుంచి ఇక్కడకు బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి, సేవలందిస్తానన్నారు.
దిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

పామిడి ఎంపీడీఓగా తేజోష్ణ

పామిడి: పామిడి ఎంపీడీఓ కే తేజోష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రభాకర్ నాయక్ గుత్తికి బదిలీ అయ్యారు, ఆయన స్థానంలో బుక్కరాయసముద్రం నుంచి ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. అలాగే ఈఓఆర్డీగా రాజేంద్ర కృష్ణకుమార్ ముదిగుబ్బ నుంచి పామిడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న శశికళ యాడికికి బదిలీ అయ్యారు. అదేవిధంగా పామిడి పంచాయతీ ఈఓగా గోపాలు కొత్తచెరువు నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఈఓగా పనిచేస్తున్న చంద్రశేఖర్ గార్లదిన్నెకు బదిలీ అయ్యారు. అలాగే పామిడి తహసీల్దార్, ఎంపీడీఓ, పంచాయతీ కార్యాలయాలకు పలువురు వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, విలేజ్ సర్వేయర్లు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు బదిలీ కాగా ఆయా స్థానాల్లో కొత్తవారు వచ్చి చేరారు.

ఎంపీడీఓ, ఈఓఆర్‌డీ బదిలీ

తాడిపత్రి రూరల్ : తాడిపత్రి ఎంపీడీఓ రంగారావు తాడిమర్రికి, ఈఓఆర్‌డీ జిలాన్ పుట్లూరుకు బదిలీ అయ్యారు. వారి స్థానంలో రామగిరి నుంచి ఎంపీడీఓ ఫజీల్‌బాషా, యాడికి నుంచి ఈఓఆర్‌డీ వెంకటేష్‌ను తాడిపత్రికి బ

మున్సిపల్ కార్యాలయంలో బదిలీలు

తాడిపత్రి రూరల్: మున్సిపల్ కార్యాలయంలో పలువురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. తాడిపత్రి మున్సిపల్ కార్యాలయం నుంచి గుంతకల్లుకు జూనియర్ అసిస్టెంట్లు విజయభాస్కర్, మాలిక్, గుత్తికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్, సీనియర్ అసిస్టెంట్ నాగార్జున, కదిరికి సీనియర్ అసిస్టెంట్ నాగరాజు, వైఎస్సార్ జిల్లా యర్రగుంట్లకు శానిటరీ సీనియర్ అసిస్టెంట్ సువర్ణ లక్ష్మి, చిత్తూరు జిల్లా మదనపల్లికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ బదిలీ అయ్యారు. తాడిపత్రి మున్సిపాలిటీకి బదిలీపై వచ్చిన వారిలో గుత్తి నుంచి సీనియర్ అసిస్టెంట్ హిమాం హుస్సేన్, వైఎస్సార్ జిల్లా యర్రగుంట్ల, జమ్మలమడుగు, సత్యసాయి జిల్లా ధర్మవరం నుంచి సీనియర్ అసిస్టెంట్ దాశరథి, రవీంద్ర, అసిఫ్ ఉన్నారు. గుంతకల్లు నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఖలీల్, శ్రీనివాసులు, జగన్మోహన్‌రెడ్డి, సత్యసాయిజిల్లా కదిరి, ధర్మవరం నుంచి జూనియర్ అసిస్టెంట్ సౌమ్య, డి. శ్రీనివాసులు తాడిపత్రికి బదిలీపై వచ్చారు.

ఎంపీడీఓగా ప్రభాకర్‌నాయక్

గుత్తి రూరల్: గుత్తి ఎంపీడీఓగా ప్రభాకర్‌నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు బదిలీ కావడంతో పామిడి ఎంపీడీఓగా ఉన్న ప్రభాకర్‌నాయక్‌ను గుత్తికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షిని మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓను ఈఓఆర్డీ శివాజీరెడ్డి, కార్యాలయ సిబ్బంది అబ్దుల్, కార్యదర్శులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పప్పుశనగ రిజిస్ట్రేషన్ మొదలు

పుట్లూరు: సబ్సిడీ పప్పుశనగ విత్తనాల కోసం శుక్రవారం 573 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఏఓ కాత్యాయని తెలిపారు. మండలంలోని తక్కళ్లపల్లి, బాలాపురం, శనగలగూడూరు రైతు సేవా కేంద్రాల వద్ద రిజిస్ట్రేషన్ పక్రియను ప్రారంభించామన్నారు. మొదటి రోజు 822 క్వింటాళ్ల కోసం నమోదు చేసినట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

జగన్మాతా.. పాహిమాం

సాక్షి నెట్‌వర్క్: శరన్నవరాత్రుల్లో భాగంగా తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో రెండో రోజు శుక్రవారం అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా ఆలయాల ఆవరణలో కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.


తాడిపత్రి అర్బన్: రాజరాజేశ్వరీ అలంకరణలో వేద గాయత్రీదేవి


గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిస్తున్న చౌడేశ్వరీదేవి


గుంతకల్లు: మహాలక్ష్మీ అలంకరణలో వాసవీ మాత


గుంతకల్లు రూరల్: బ్రహ్మీదేవిగా కొల్హాపూర్ మహాలక్ష్మి


గుత్తిలో మహాలక్ష్మి దేవిగా వాసవీ మాత


యాడికి: బాల త్రిపుర సుందరిగా పెద్దమ్మ తల్లి


గుత్తి రూరల్: సేవాగఢ్‌లో గాయత్రిదేవిగా మాతా జగదాంబ


బీకేఎస్‌లో గాయత్రీదేవి అలంకరణలో ముసలమ్మ తల్లి